22

# రెక్కాడినా డొక్కాడదు!

వేలాది సంవత్సరాల కిందట, రాతి కొడవళ్ళనూ, గొడ్డళ్ళనూ, కత్తులనూ మనిషి వాడిన మాట నిజమే! అంతకు ముందు దశకన్నా రాతి పనిముట్లను వాడే దశ, చాలా మెరుగయిందనడంలో సందేహం కూడా లేదు. అయితే, రాతి పనిముట్లతోనే మానవుడు సంతృప్తి పడలేదు. అంతకన్నా మేలయిన వాటికోసం, అతను అన్వేషణలు సాగించాడు. ఈ కృషి ఫలితంగా, లోహాలతో అతనికి నేస్తం ఏర్పడింది. ఈ స్నేహం అతని బతుకును అద్భుతంగా మార్చింది. ఇప్పటికీ మారుస్తున్నది. ఎక్కువ బొగ్గునూ, లోహాలనూ ఉపయోగించుకొంటున్న దేశాలు పారిశ్రామికంగా ముందడుగు వేస్తున్నాయి; ఆ పని చేయలేని దేశాలు బడుగు దశను దాటి ముందుకెళ్ళలేకపోతున్నాయి.

తొలిసారిగా లోహాలతో పరిచయం ఏర్పడినప్పుడు, అనాది మానవుడు, వాటిని సవ్యంగానే ఉపయోగించుకొన్నాడు. అంతవరకూ తను వాడుతన్న రాతి గొడ్డళ్ళను, కొడవళ్ళను, కత్తులను, పక్కగా ఉంచి- లోహంతో - ఇనపలోహంతో - వాటిని చేయడం ప్రారంభించాడు. ఈ లోహపు పనిముట్లు, రాతి వాటికన్నా, అన్ని విషయాల్లోనూ మేలైనవని రుజువయింది. గట్టి దెబ్బ తగిలితే, రాతి గొడ్డలి - ముక్కలు కావచ్చు. కానీ ఇనప గొడ్డలి కక్కుపోతుంది. లేదా వొంగిపోతుంది. అంతేగానీ ముక్కలయిపోదు. ఈ సదుపాయం, ఆనాటి మానవునికి ఎంతో శ్రమను తగ్గించి, అతనికి కాలాన్ని పొదుపు చేసి పెట్టింది. ఆ రోజుల్లో ఈ పని ముట్లను ఏ విధంగా తయారు చేసేవారో, యిప్పుడూ దాదాపుగా అదే పంపిణీమీద తయారు చేస్తున్నారని, శ్రీరాములును చూస్తే తెలుస్తుంది. ఎన్నో విషయాల్లో ఎన్నెన్నో మార్పులు కొట్టవచ్చినట్లుగా కనపడుతున్నాయి. వీటిలో కొన్నింటిని మనమెన్నడూ ఊహించి ఉండం! ఇది నిజమేగానీ - ఈ మార్పులు అన్ని రంగాలకూ విస్తరించలేదనడానికి శ్రీరాములే ఒక ఉదాహరణ!

అసలాయనిది ఆ వూరేకాదు. వారి పూర్వీకులు, భీమవరం ప్రాంతంలో ఉండేవారట. అక్కడ పొట్ట జరక్క కంచం, మంచం, నెత్తినేసుకొని, బెజవాడదాకా వచ్చారు. ఇక్కడ కూడా ఇమడలేక, ఉయ్యూరు దాపుల్లో స్థిరపడిపోయారు. స్థిరపడిపోయారంటే, ఆర్థికంగా కాదు; మరింక అక్కణ్ణించి కదిలినా, కుదురుకోడం కష్టం గనక అక్కడే ఉండిపోయారు.

కమ్మరం శ్రీరాములుకు అసలే కొత్త కాదు. ఆయన తాతగారూ, తండ్రిగారూ, అదే పని చేశారు. ఆయన తమ్ముళ్ళందరూ, ఇప్పటికీ ఆపనే చేస్తున్నారు. శ్రీరాములు తన పన్నెండో ఏట నుండి కొలిమి దగ్గర కూచుంటున్నాడంటే, ఆయనకు కొలిమితోనూ, దాగలితోనూ అక్కడి పనితోనూ పావు శతాబ్ధి అనుభవం ఉన్నదన్నమాట. ఇంత కాలం లోనూ, ఆయన గడించిన అనుభవం అపారం. కానీ, తను పనిచేసే పద్ధతిలో మార్పేమీ లేదంటాడాయనగారు.

"నా పనిలో రెండు రకాలున్నాయండీ; నా అంతట నేనే కొడవళ్ళు, గొడ్డళ్ళు, గీత కత్తులు, ఎరుకల కత్తులు, చెప్పుల కత్తులు, చెరుకు కత్తులు తయారు చేసి అమ్ముతూ ఉంటాను. ఇంకోరకం ఏమిటంటే వీటిని సరిచి, సానాడించి, పదును బెట్టడం. ఈ రెండు రకాల పనులూ నా దగ్గర కొస్తాయండి!" అన్నాడు శ్రీరాములు.

వీటిని తయారు చేయడానిక్కావలసిన ఉక్కు ముక్కల్ని గుంటూరు నుంచి, విజయవాడ

నుంచి తెచ్చుకుంటూ ఉంటాడు. ఏ కలిగినయ్య దగ్గరో నోటు రాసి డబ్బు తెచ్చుకొని, ఉక్కు పలకల్నీ, ముక్కల్నీ కొంటాడు. వాటిని పనిముట్ల కింద మార్చి, అమ్ముకొంటూ ఉంటాడు.

చెరుకు కత్తిని సరిచి, సానాడించి పదును బెడితే 6, 7 రూపాలిస్తారు. అదే కొత్తది కావాలంటే, కత్తి సడింపును బట్టి 10, 12 రూపాయలకు తక్కువ కాకుండా అమ్ముతాడు. కొత్త కొడవలి 4, 4న్నర, మరీ ఎద్దడి రోజులైతే 5 రూపాయలు. ఉక్కుముక్క అవతలి వారే తెచ్చుకొంటే 3 రూపాయలు కూలి. అదే చెప్పుల కత్తికి (చర్మకారులు వాడేది) 6, 7 రూపాయలు. కొత్తదయితే 10 రూపాయలు తీసుకొంటాడు. తాటాకు నరకడానికి పనికొచ్చే గవళ్ళ కత్తికి కూడా ఇదే రేటు.

“ఒక్కోసారి సరచవలసిన అవసరం ఉండదండీ! కొడవలి ఎక్కడా కక్కుపోదు. కానీ చస్తే తెగదు. అలాంటప్పుడు సానపడితే సరిపోతుందండీ! సాన పట్టడానికయితే కొడవలికి ముప్పావలా తీసుకొంటాను. చెరుక్కత్తికి రూపాయి. గొడ్డలికీ రూపాయే ఇస్తారండి! చెప్పుల కత్తి, గవళ్ళ కత్తి, ఎరికల కత్తి, గీత కత్తి సానపడితే రెండు రూపాయలిస్తారు. కొత్త గొడ్డలి, అంతా నాదే ఐతే 6, 7 రూపాయలకిస్తాను. ముక్క తెచ్చిచ్చారనుకోండి 3, 4 రూపాయల కూలి చూసుకొని తయారైన గొడ్డలివడేస్తా” అన్నాడు శ్రీరాములు.

పంచదార ఫ్యాక్టరీ, సంవత్సరంలో 5, 6 మాసాలు పనిచేస్తుంది. ఆ రోజుల్లో చెరుక్కత్తులకు గిరాకీ ఉంటుంది. నవంబరు, డిసెంబరు మాసాల్లో కొడవళ్లకు వత్తిడి ఉంటుంది. ఈతభావతులన్నీ శ్రీరాములుకు తెలుసు గనుకనే, అతను ఎప్పటికప్పుడు జనానిక్కావలసిన వాటిని తయారు చేసి సిద్ధంగా ఉంచుతాడు.

“ఇవన్నీ వొక్కరెక్కమీద తయారు కావండీ! తిత్తులూదే మనిషికి రోజుకు ఆరు రూపాలివ్వాలి. కొలిమి పనిచేసే వాడికి పది రూపాయలివ్వాలి. సమ్మెట చేసేవాళ్ళు ముగ్గురన్నా ఉంటే తప్ప, పనులు కావండీ! వారికైతే మనిషివొక్కంటికి రోజుకు ఏడు దాకా ఇవ్వాల్సిందేనండి! కొలిమిలోకి కావల్సిన రైలు బొగ్గు కొట్టివ్వడానికి ఇతర చిల్లర మల్లర పనులు చేయడానికి వొకడు కావాలి. వాడికి 5, 6 ఇస్తానండి. సాన లాగడానికి ఇద్దరు మనుషులకూ కలిపి రోజుకు 15, 16 దాకా ఇస్తుంటానండి” అన్నాడు శ్రీరాములు తన పనివాళ్ళనందరినీ పరిచయం చేస్తూ, వాళ్ళూ ‘ఈసురో’మంటూ, కళ్ళల్లో ప్రాణాలు పెట్టుకొని బతుకుతున్నారనిపించింది.

“కొలిమి వేడికి నెత్తురంతా ఆవిరయిపోతయింది. మలాటాతో సరిచి, రెక్కలు ముక్కలు చెక్కలయిపోయాయి. ఇన్నేళ్ళు వచ్చినా తిన్నదంతా అరుగుతుందిగానీ బాబూ, తృప్తిగా తినడానికే నాకేమీ ఉండదండి!” అన్నాడు శ్రీరాములు.

అలా అంటున్నప్పుడు అతని బక్క పేగులు గురు గురు మన్నట్లనిపించింది!